
సాక్షి
గుంటూరు
బుధవారం ၊ 13 ၊ మార్చి ၊ 2024



నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో మంగళవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.6500, గరిష్ట ధర రూ.8100, మోడల్ ధర రూ.7200 వరకు పలికింది.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 514.00 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది.

వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



బెల్లంకొండ: కొండపై ప్రతిష్ఠించిన వేంకటేశ్వరునికి మంగళవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ప్రతిష్ఠ జరిగి 16 రోజులు పూర్తయిన సందర్భంగా పూజలు చేసినట్టు ఆలయ కమిటీ వెల్లడించింది.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (బుధ)	సహరి (గురు)
గుంటూరు	6.23	5.01
చిలకలూరిపేట	6.26	5.01
బాపట్ల	6.23	5.01

సంక్షేమ అజెండా రెపరెపలు

నాడు..

స్తబ్ధతకు, అహంకారానికీ అసమర్థ పాలనకు ప్రతీక..
వైఎస్సార్ మరణంతో.. అహంకార
పాలన కక్షకట్టింది..
అడుగడుగునా అవమానాలు..
ప్రతిపక్షాలతో కలిసి కుట్రలు కుతంత్రాలు..
అధికార కుట్రలను ఎదుర్కొంటూ..
తండ్రి ఆశయాలు నెరవేర్చేందుకు..
ఒంటరిగా మొదలైన ఓదార్పుయాత్ర..
అలా మొదలైన ప్రస్థానం..

నేడు

బక్కచిక్కిన ఎడ్లు వెంటరాగా నాగలి
భుజాన వేసుకుని పొలం వెళ్తున్న రైతుకు
అండగా రైతు భరోసాతో నేనున్నానంటూ..
పండుటాకుల చేయి పట్టుకుని ఆసరాగా..
భారతావనిలో ఎన్నాడూ లేని విధంగా
పేదల సొంతింటి కల నెరవేర్చి..
కాలనీలు నిర్మించి..
చేతివృత్తులకు చేయూతనిస్తూ..
గాంధీజీ స్వప్నం గ్రామ సచివాలయాల్లో చూపిస్తూ..
కార్పొరేట్ కబంధ హస్తాలలో బంధీ అయిన
చదువుల 'సరస్వతి'ని పేదలకు చేరువ చేస్తూ..
పేదలకు కార్పొరేట్ వైద్యంతో ఆరోగ్య
రక్షణ కల్పిస్తూ..
నవరత్నాలతో ఆనందాలు కురిపిస్తూ..
అవ్వాతాతలకు ఇంటి పెద్దకొడుకుగా..
అక్కచెల్లెమ్మలకు అన్నగా..
చిన్నారులకు మేనమామగా..
అన్ని వర్గాలకు అందరించే అన్నయ్యగా..
నేడు లక్షలాది కుటుంబాలు వెంట రాగా
విశ్వసనీయతకు ప్రతీకగా..
సంక్షేమ శిఖరాన వైఎస్సార్ సీపీ జెండా రెపరెప
లాడుతోంది..
ఊరూవాడా మంగళవారం వైఎస్సార్ సీపీ 14వ
ఆవిర్భావ దినోత్సవంతో సందడి నెలకొంది..

- ఘనంగా వైఎస్సార్ సీపీ 14 ఆవిర్భావ దినోత్సవం
- సేవా కార్యక్రమాలలో ఎమ్మెల్యేలు, సమన్వయర్తలు



గుంటూరు పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ జెండా ఆవిష్కరించి మాట్లాడుతున్న పార్టీ సమన్వయకర్త, మంత్రి విడదల రజిని

సాక్షి ప్రతినిధి, గుంటూరు: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో వైఎస్సార్ సీపీ 14వ వార్షికోత్సవాన్ని ఊరూవాడా ఘనంగా నిర్వహించారు. జిల్లాలోని అన్ని చోట్ల పార్టీ జెండాలు ఆవిష్కరించారు. వివిధ ప్రాంతాల్లో సేవ కార్యక్రమాలు నిర్వహించారు.

➡ గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని చంద్రమౌళినగర్‌లోని ఆమె కార్యాలయంలో వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. మహానేత డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. భారీ ర్యాలీతో నియోజకవర్గంలోని ప్రధాన రహదారిలో ప్రదర్శన నిర్వహించారు. శాసన మండలి విప్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి తన కార్యాలయంలో వైఎస్సార్ సీపీ జెండా ఆవిష్కరించి, కార్యకర్తలతో కలసి కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు.

➡ గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా కార్యాలయంలో ఎమ్మెల్యే ముస్తఫా, వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా పార్టీ జెండా ఆవిష్కరించారు. పార్టీ నేతలు, కార్యకర్తలతో కలసి కేక్ కట్ చేశారు. బృందావన్‌గార్డెన్స్‌లోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పార్టీ నేతలు, కార్యకర్తలతో కలిసి పార్టీ జెండాను ఆవిష్కరించి కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు.

➡ తాడికొండ నియోజకవర్గం తుళ్లూరులో ప్రత్తిపాడు ఎమ్మెల్యే మేకతోటి సుచరిత కేక్ కట్ చేసి, వేడుకలు నిర్వహించారు. శృంగారపాటి సందీప్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. తాడికొండలో పార్టీ మండల అధ్యక్షుడు బొర్రా వెంకటేశ్వరరెడ్డి, సర్పంచి తోకల సరోజని, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. దివంగత మహానేత డాక్టర్ వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఫిరంగిపురం మండలంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో జెడ్పీటీసీ దాసరి కత్తిరేణమ్మ, పార్టీ మండల అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి, వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

➡ ప్రత్తిపాడు నియోజకవర్గం ఏటుకూరులోని పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. పార్టీ జెండాను ఆవిష్కరించి భారీ కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు.

➡ పొన్నూరు నియోజకవర్గం పొన్నూరు పట్టణంలోని పార్టీ కార్యాలయంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. తెలగపాలెంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. మామిళ్లపల్లి గ్రామంతో పాటు, పట్టణంలోని కూరగాయల మార్కెట్ సెంటర్, అంబేడ్కర్ సెంటర్‌లోని దివంగత మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఏఎంసీ చైర్మన్ ఎ.వెంకటేశ్వరరావు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ నల్లమోతు రూత్‌రాణి, జెడ్పీటీసీ సభ్యుడు కర్లపూడి రమేష్, నాయకులు నాగూర్, కరీం పాల్గొన్నారు.

➡ తెనాలి నియోజకవర్గం పరిధిలోని పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పార్టీ జెండా ఆవిష్కరించారు. కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా దివంగత మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



తుళ్లూరులో కేక్ కట్ చేస్తున్న ప్రత్తిపాడు ఎమ్మెల్యే మేకతోటి సుచరిత



గుంటూరు తూర్పులో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే ముస్తఫా, నూరిఫాతిమా

మంగళగిరిలో


మంగళగిరి నియోజకవర్గం మంగళగిరి పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, నియోజకవర్గ సమన్వయకర్త మురుగుడు లావణ్య, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల, పార్టీ జెండాను ఆవిష్కరించారు. కేక్ కట్ చేశారు. తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు బుర్రముక్కు వేణుగోపాలస్వామి రెడ్డి, రూరల్ అధ్యక్షుడు అమర నాగయ్య ఆధ్వర్యంలో పార్టీ జెండా ఆవిష్కరించి, కేక్ కట్ చేశారు. ఎంటీఎంసీ అధ్యక్షుడు దొంతిరెడ్డి వేమారెడ్డి వేడుకల్లో పాల్గొన్నారు. దుగ్గిరాలలో పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.ఏసురత్నం ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణి, జెడ్పీటీసీ మేకతోటి అరుణ పాల్గొన్నారు.



మంగళగిరిలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ మురుగుడు, ఎమ్మెల్యే ఆర్కే, సమన్వయకర్త లావణ్య

న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీ చిలకలూరిపేట సమన్వయకర్తగా కావటి



సాక్షి, నరసరావుపేట: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ చిలకలూరిపేట అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తగా కావటి మనోహర్ నాయుడుని నియమిస్తున్నట్టు పార్టీ కేంద్ర కార్యాలయం మంగళవారం ఓ ప్రకటన విడుదల చేసింది. కావటి మనోహర్ నాయుడు ప్రస్తుతం గుంటూరు నగరపాలక సంస్థ మేయర్‌గా ఉన్నారు. గతంలో పెదకూరపాడు నియోజకవర్గ సమన్వయకర్తగా కూడా పనిచేశారు.

రేపు జాబ్ మేళా

లక్ష్మీపురం: గుంటూరు జిల్లా ఉపాధి కార్యాలయంలో గురువారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 2 గంటల వరకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కార్యాలయ అధికారి కె.రఘు మంగళవారం తెలిపారు. జిల్లా పరిసర ప్రాంతాల్లో ఉన్న నిరుద్యోగ యువతి, యువకులు ఈ జాబ్ మేళాలో పాల్గొని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా తెలియజేశారు. గ్రీన్‌టిక్ ఇండస్ట్రీస్, కొయా కన్సల్టింగ్, హెటిరో డ్రగ్స్, నియోస్ లెన్స్, మణిపురం, ఆదిత్య బిర్ల క్యాపిటల్స్, అరబిందా, ముత్తూట్ ఫైనాన్స్ కంపెనీ సంస్థ వారు ప్రత్యేకంగా ఈ జాబ్ మేళాలో హాజరతారని తెలిపారు. ఈ జాబ్ మేళాకు 10వ తరగతి, ఐటీఐ, ఇంటర్, బి.టెక్, డిగ్రీ, ఎంబీఏ, ఎంసీఏ వరకు విద్యార్హత, 18–35 సంవత్సరాల వయస్సు గల నిరుద్యోగ యువతీ యువకులు అర్హులు అని తెలిపారు. అభ్యర్థులు వారి బయోడేటా, రెస్యూమ్, విద్యార్హత, ఆధార్ పత్రాల జిరాక్స్ కాపీలు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోతో నేరుగా ఇంటర్వ్యూలకు గుజ్జనగుండ్ల సర్కిల్ వద్ద గల జిల్లా ఉపాధి కార్యాలయంకు హాజరు కావల్సిందిగా తెలిపారు. ఇతర వివరాలకు 9652065235, 9052438392 నంబర్లకు సంప్రదించాల్సిందిగా తెలియజేశారు.

పొదుపు, పరపతి సహకార సంఘం అడ్‌హాక్ కమిటీ



నరసరావుపేట: జిల్లా పొదుపు, పరపతి సహకారం సంఘ అడ్‌హాక్ కమిటీని పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ నియమించారు. కలెక్టరేట్‌లో కమిటీ చీఫ్ ప్రమోటర్‌గా నియమితులైన డీఆర్‌డీఏ పీడీ బాలూనాయక్‌కు మంగళవారం నియామకపత్రం అందజేశారు. ఈ కమిటీకి కార్యవర్గ సభ్యులుగా డీఆర్వో కె.వినాయకం, ఏపీఎంఐపీ పీడీ ఆంజనేయులు, ఆర్ అండ్ బి ఎగ్జిక్యూటీవ్ ఇంజనీరు రాజానాయక్, ప అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ గజ్జల శ్రీనివాసరెడ్డి, పంచాయతీరాజ్ ఇంజనీర్ సుబ్బరాయుడు, మార్కెటింగ్‌శాఖ ఏడీఏ సూర్యప్రకాష్‌రెడ్డి నియమితులయ్యారు.

గతిశక్తి కార్గో టెర్మినల్ ప్రారంభం



దాచేపల్లి: ప్రధాన మంత్రి నరేంద్రమోదీ వర్చువల్‌గా గతిశక్తి కార్గో టెర్మినల్ రైలు మార్గాన్ని మంగళవారం ప్రారంభించారు. తుమ్మలచెరువు రైల్వే స్టేషన్ నుంచి పెదగార్లపాడు గ్రామ సమీపంలోని చెట్టినాడ్ సిమెంట్ ఫ్యాక్టరీ వరకు కార్గో టెర్మినల్ నిర్మించారు. ఢిల్లీ నుంచి వర్చువల్‌గా మోదీ ఈ మార్గాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే డీజీఎం సీహెచ్ ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా పది వందేభారత్ రైళ్ల, గతిశక్తి కార్గో టెర్మినల్స్‌ని ప్రధాని మోదీ ప్రారంభించారని చెప్పారు. కార్యక్రమంలో ఏడీఈఎస్ టీపీ కృష్ణయ్య, ఏడీఈ ఎల్.శ్రీరాములు, ఫ్యాక్టరీ జాయింట్ ప్రెసిడెంట్ సీహెచ్ సీతారాములు, హెచ్‌ఆర్ హెడ్ బీబీఆర్ రాజు, లాజిస్టిక్ హెడ్ పీఎస్ ప్రేమ్‌కుమార్, హెచ్‌ఆర్ మేనేజర్ షేక్ అన్వర్ పాల్గొన్నారు.

గీతాంజలి స్మృతిలో కొవ్వొత్తుల ర్యాలీ



కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న ఎంపీ నందిగం, ఎమ్మెల్యే అన్నాబత్తుని, ఎమ్మెల్సీలు సునీత, కల్యాణి, గీతాంజలి భర్త

తెనాలిరూరల్: జగనన్న నా సొంతింటి కల నెరవేర్చాడని చెప్పిన నేరానికి గీతాంజలి అనే పేదింటి మహిళను టీడీపీ, జనసేన రాబందులు పొట్టబెట్టుకున్నాయని వైఎస్సార్ సీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోషల్ మీడియాలో తనపై వస్తున్న ట్రోలింగ్‌తో మనస్తాపం చెంది తెనాలికి చెందిన గొల్తి గీతాంజలి రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని వైఎస్సార్ సీపీ నాయకులు మంగళవారం సాయంత్రం పట్టణంలో కొవ్వొతుల ర్యాలీ నిర్వహించారు. గీతాంజలి భర్త బాలచందర్‌తో కలసి వారి ఇంటి వద్ద నుంచి కొత్త వంతెన వరకు ర్యాలీగా వెళ్లి ఆమె చిత్ర పటం వద్ద అంజలి ఘటించారు. మృతురాలి కటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా కల్పించారు. మహిళా కమిషన్ మాజీ చైర్మన్ వాసిరెడ్డి పద్మ, ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, బాపట్ల ఎంపీ నందిగం సురేష్, ఎమ్మెల్సీలు పోతుల సునీత, వరుదు కళ్యాణి, వైఎస్సార్‌సీపీ సోషల్‌మీడియా, మీడియా కోఆర్డినేటర్ సజ్జల భార్గవ్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక రమేష్, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా కన్వీనర్ బూరెల నాంచారమ్మ, ప్రసాదం బాలగురవమ్మ, కె.నిర్మల ఈశ్వర్, వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కో ఆర్డినేటర్‌లు రజని, సుమ పాల్గొన్నారు.

కారకులకు కఠినంగా శిక్ష పడాలి

తెనాలి: తమకు ఏ రాజకీయ పార్టీతోనూ సంబంధం లేదని గీతాంజలి భర్త బాలచంద్ర పేర్కొన్నారు. మంగళవారం తనను పరామర్శించటానికి వచ్చిన రాష్ట్ర మంత్రి విడదల రజిని, ఎంపీ నందిగం సురేష్, వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కన్వీనర్ సజ్జల భార్గవ, ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్సీలు పోతుల సునీత, వరుదు కళ్యాణితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఇంటి స్థలం రావటంతో తానెంతో పొంగిపోయిందని గీతాంజలి గురించి చెప్పారు. రాత్రంతా ఫోన్ చూస్తూ ఉండటాన్ని చూశాను. ఇక్కడే ఒక ప్రైవేటు స్కూల్లో టీచర్‌గా జాబ్ వచ్చింది.. అందు కోసం ఏదైనా తయారవుతుందేమోనని అనుకున్నా... తర్వాత ఎందుకో అనుమానం వచ్చి ఫోన్ తీసుకుని చూశాను. రెండు పోస్టులు చూడగానే నాకు చాలా బాధనిపించింది. చూడలేక వదిలేశాను. అవన్నీ చూస్తూ ఎంతో బాధపడి వుంటుంది, చివరికిలా చేసుకుంది. కారకులకు కఠినంగా శిక్ష పడాలి. ఇంకో కుటుంబం తమలా వీధినపడకూడదని స్పష్టంగా చెప్పారు.

రైల్వే ప్రాజెక్ట్‌లను ప్రారంభించిన మోదీ

- గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో వర్చువల్‌గా..
- హాజరైన జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న హెనీ క్రిస్టినా

లక్ష్మీపురం: దక్షిణ మధ్య రైల్వే గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో పలు స్టేషన్‌లలో వివిధ ప్రాజెక్టులను దేశ ప్రధాని నరేంద్రమోదీ మంగళవారం వర్చువల్‌గా ప్రారంభించారు. స్థానిక గుంటూరు డీఆర్ఎం ఎం.రామకృష్ణ ఆధ్వర్యంలో అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవానికి జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధాని దాదాపు దేశ వ్యాప్తంగా రూ.85 వేల కోట్ల విలువ చేసే వివిధ రైల్వే ప్రాజెక్ట్‌లను జాతికి అంకితం చేయడం అందులో గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని ప్రాజెక్ట్‌లు ఉండటం డివిజన్ వాసులు చేసుకున్న అదృష్టం అన్నారు. రైల్వే డీఆర్ఎం ఎం.రామకృష్ణ మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని వన్ స్టేషన్ వన్ ప్రాజెక్ట్ స్టాల్స్‌లో భాగంగా రేపల్లె, గుంటూరు, నరసరావుపేట, కంభం, గిద్దలూరు, నంద్యాల, నల్గొండలో ప్రధాన మంత్రి ఔట్ లేట్లను జాతికి అంకితం చేశారని తెలిపారు. డివిజన్ పరిధిలోని రెండు గతి శక్తి కార్గో టెర్మినల్స్ ఉన్నట్లు వివరించారు.

రైలు కోచ్ రెస్టారెంట్..

గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని ప్రారంభించిన ప్రాజెక్ట్‌లలో గుంటూరు రైల్వే స్టేషన్ పశ్చిమ విభాగం వైపు రైల్ కోచ్ రెస్టారెంట్‌ను జిల్లా పరిషత్ చైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా శిలాఫలాకాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం సైమాన్, డీసీఎం కె.కమలాకర్ పాల్గొన్నారు.

ఎన్నికల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీల పనితీరు కీలకం

కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి



గుంటూరు వెస్ట్: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రవర్తనా నియమావళిని సక్రమంగా అమలు చేయాలంటే ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీల పనితీరు కీలకమని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో అధికారుల సమావేశం మంగళవారం నిర్వహించారు.

కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో మద్యం, నగదు, ఓటర్లను ప్రలోభ పెట్టే విలువైన వస్తువులను పట్టుకోవడంతో పాటు వాటిని నివారించడానికి ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఎన్నికల కోడ్ ప్రకటించగానే ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలైన ఇంకమ్ టాక్స్, సేల్స్ టాక్స్, ఎక్సైజ్, ఫారెస్ట్, పోలీస్ తదితర శాఖలు నియమావళిని అనుసరించాలని ఆదేశించారు. నియోజకవర్గాల వారీగా బృందాలను ఏర్పాటు చేసుకోవాలని కోరారు. తనిఖీల్లో పట్టుబడ్డ వాటిని సీజ్ చేయడం, భద్రపరచడం తదితర అంశాలను ఎన్నికల నియమావళిని అనుసరించి అమలు చేయాలని చెప్పారు. దీంతోపాటు ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను పరిశీలించాలని కోరారు. అక్రమార్కుల సమాచారాన్ని సేకరించడం, వాటిని నివారించడంలాంటివి తప్పక అమలు చేయాలని పేర్కొన్నారు. పార్టీలకు అతీతంగా ఎన్నికల విధులు నిర్వహించాలని, ఎటువంటి ఒత్తిడులకు తలొగ్గద్దని కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో ఎస్పీ తుషార్ డూడీ, జిల్లా ఖజానా శాఖ అధికారి బి.రాజగోపాలరావు, డీఎఫ్ఓ మహబూబ్ బాషా, జిల్లా ఆడిట్ అధికారి బి.ధనలక్ష్మి, డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్ పాల్గొన్నారు.

పది పరీక్షలకు పదండిలా..!

- తొలిసారిగా పబ్లిక్ పరీక్షలు రాస్తున్న విద్యార్థుల్లో ఎన్నో సందేహాలు
- పరీక్ష కేంద్రంలో పాటించాల్సిన నిబంధనలపై ప్రభుత్వ మార్గదర్శకాలు
- విద్యార్థులతో పాటు ఇన్విజిలేటర్లకు వేర్వేరుగా నియమావళి
- పరీక్ష కేంద్రాలను ముందుగానే సందర్శించడం మేలు..
- ఈనెల 18 నుంచి 30వరకు జరగనున్న పరీక్షలు
- గుంటూరు జిల్లావ్యాప్తంగా 147 పరీక్ష కేంద్రాలు
- హాజరుకానున్న 31,291 మంది విద్యార్థులు



గుంటూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో టెస్ట్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులు

గుంటూరు ఎడ్యుకేషన్: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మరోవారం రోజుల్లో ప్రారంభం కానున్నాయి. టెన్త్ విద్యార్థులు తొలిసారిగా పబ్లిక్ పరీక్షలకు హాజరుకానున్నారు. చదువుతున్న పాఠశాలకు దూరంగా కొత్తగా కేటాయించిన కేంద్రానికి వెళ్లి, పరీక్ష రాయాల్సిన విద్యార్థుల్లో ఎన్నో సందేహాలు, ప్రశ్నలు ఉత్పన్నమవుతాయి. దీనిని దృష్టిలో ఉంచుకున్న ప్రభుత్వ పరీక్షల విభాగం విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలతో కూడిన నియమావళిని హాల్ టిక్కెట్లపై ముద్రించింది. ఈనెల 18 నుంచి 30వ తేదీ వరకు జరగనున్న పరీక్షలకు గుంటూరు జిల్లావ్యాప్తంగా హాజరు కానున్న 31,291 మంది విద్యార్థులకు 147 కేంద్రాలను సిద్ధం చేశారు. హాల్ టికెట్లు పొందిన విద్యార్థులు ఆయా పరీక్ష కేంద్రాలను తమ తల్లిదండ్రులతోపాటు సందర్శించడం మేలు.

విద్యార్థులూ... వీటిని పాటించండి

- ఉదయం 8.30 గంటల కల్లా ఖచ్చితంగా పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి
- ఉదయం 8.45 నుంచి 9.30 వరకు కేంద్రాల్లోకి అనుమతిస్తారు. 9.30 తరువాత గేట్లు మూసి వేసిన తరువాత ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించరు.
- హాల్ టికెట్లు పొందిన విద్యార్థులు దానిపై ముద్రించిన తమ వివరాలు, పుట్టిన తేదీ, తల్లిదండ్రుల పేర్లు, రాయాల్సిన సబ్జెక్టులు, పరీక్ష కేంద్రం పేరు, చిరునామా సరి చూసుకోవాలి. వాటిలో ఏమైనా తప్పులు ఉన్నట్లయితే ముందుగానే తాము చదువుతున్న పాఠశాల ప్రధానోపాధ్యాయుల ద్వారా ప్రభుత్వ పరీక్షల విభాగం దృష్టికి తీసుకెళ్లి, సరి చేయించుకోవాలి.
- క్వశ్చన్ పేపర్‌పై ఏడు అంకెలతో కూడిన ప్రత్యేక కోడ్ ముద్రిస్తోంది. హాల్ టికెట్‌పై ఉన్న ఎన్‌రోల్‌మెంట్ నంబరు ఆధారంగా కేటాయించిన రూముల వారీగా విద్యార్థులను కూర్చోబెడతారు. బార్ కోడింగ్ విధానంలో రూపొందించిన ఓఎంఆర్ షీట్లను విద్యార్థుల రోల్ నంబరు ఆధారంగా పంపిణీ చేస్తారు.
- రోల్ నంబరు ఆధారంగా విద్యార్థి తనకు కేటాయించిన సీట్లో కూర్చున్న తరువాత ఇన్విజిలేటర్ వచ్చి బార్ కోడింగ్‌తో కూడిన ఓఎంఆర్ షీట్, ప్రశ్నాపత్రం, ఆన్సర్ బుక్‌లెట్ అందజేస్తారు. తదుపరి ఓఎంఆర్ షీట్ పూరించే విధానంపై ఇన్విజిలేటర్ ఇచ్చే సూచనలు పాటిస్తూ జాగ్రత్తగా పూరించాలి. దానిపై అనవసరమైన గీతలు, రాతలు రాయరాదు.
- ఉదయం 9.30 గంటలకు పరీక్ష ప్రారంభమైన తరువాత, మధ్యాహ్నం 12.45 గంటలకు పరీక్ష ముగిసేవరకు విద్యార్థులను బయటకు వెళ్లనివ్వరు. గుర్తింపుకార్డు కలిగి, పరీక్షల విధుల్లో ఉన్న అధికారులు, స్క్వాడ్ బృందాలను పరీక్ష కేంద్రాల్లోకి తనిఖీలకు అనుమతిస్తారు.

తప్పుడు ప్రచారాలు నమ్మవద్దు..

- ప్రశ్నాపత్రం లీకేజీ అయ్యిందని, పరీక్ష కేంద్రం నుంచి బయటకు వచ్చిందని కొందరు పనిగట్టుకుని చేసే ప్రచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మకుండా, విద్యార్థులు పరీక్షలకు ప్రశాంతంగా హాజరు కావాలి. ఒక వేళ ఏదైనా సెంటర్ నుంచి ప్రశ్నాపత్రం లీకేజీకి గురైతే, అది ఎక్కడ జరిగిందో గుర్తించే విధానాన్ని ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది.
- పరీక్ష కేంద్రంలో పక్క, పక్కన కూర్చునే ఏ ఇద్దరు విద్యార్థులకు ఇచ్చే ప్రశ్నాపత్రంలో ప్రశ్నలు ఒకే వరుస క్రమంలో ఉండని దృష్ట్యా, విద్యార్థులు పక్కవారి పేజీలను చూసి సమాధానాలు రాయాలనే ఆలోచన వీడాలి. కాపీయింగ్‌కు పాల్పడినా, జేబుల్లో స్లిప్పులు పెట్టుకుని వచ్చినా, పరీక్ష కేంద్రంలో క్షుణ్ణంగా తనిఖీ చేస్తారు. పరీక్ష రాసే సమయంలో ఏ విద్యార్థి వద్ద అయినా స్లిప్పులు కనిపిస్తే పరీక్షల నుంచి డీబార్ చేస్తారు.
- పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు తీసుకురావడంపై నిషేధం విధించిన ప్రభుత్వం డీఓలు, ఇన్విజిలేటర్లతో పాటు చీఫ్ సూపరింటెండెంట్లు వద్ద సైతం సెల్‌ఫోన్లు ఉండేందుకు అనుమతిలేదు. ఒకవేళ విద్యార్థులు ఎవరైనా తమ వెంట సెల్‌ఫోన్లు తెస్తే, వాటిని భద్రపర్చేందుకు పరీక్ష కేంద్రాల్లో ఎటువంటి ఏర్పాట్లు ఉండవు.

క్లుప్తంగా

డాక్టర్ షమ సుల్తానాకు బిజినెస్ నెట్‌వర్క్ అవార్డు



అవార్డు అందుకుంటున్న డాక్టర్ మొహమ్మద్ షమ సుల్తానా

గుంటూరు మెడికల్: గుంటూరుకు చెందిన సీనియర్ గైనకాలజిస్ట్, హోప్‌విన్ హాస్పటల్స్ అధినేత డాక్టర్ షమ సుల్తానాకు బిజినెస్ నెట్‌వర్క్ అవార్డు లభించింది. ఉమెన్స్ డేను పురస్కరించుకుని గుంటూరులో వెల్‌కమ్ హోటల్‌లో జరిగిన ఓ ప్రత్యేక కార్యక్రమంలో సిగ్న రోస్ సంస్థ వారు అతి తక్కువ ఫీజుకే కార్పొరేట్ వైద్య సేవలను అందిస్తున్నందుకు డాక్టర్ షమ సుల్తానాకు అవార్డు అందజేశారు. అవార్డు అందుకున్న షమసుల్తానాకు సీనియర్ లెప్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ నజీరుద్దీన్, గైనకాలజిస్ట్ వైద్యుల సంఘం నాయకులు అభినందనలు తెలిపారు.

హోంగార్డు భార్యకు ఆర్థిక సాయం

రూ.5లక్షల నగదు చెక్కు అందజేసిన పల్నాడు ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి

నరసరావుపేట: అనారోగ్యంతో మృతిచెందిన హోంగార్డు కుటుంబానికి తమ ఒక్కరోజు వేతనాన్ని అందించి, అండగా నిలిచిన హోంగార్డులు అభినందనీయులని జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పిడుగురాళ్ల టౌన్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ గతేడాది అనారోగ్యంతో మృతిచెందిన హోంగార్డు సీహెచ్ మరియదాసు భార్య రత్నకుమారికి రూ.5లక్షల నగదు చెక్కును ఆర్థిక సాయంగా ఎస్పీ అందజేశారు. ఏఆర్‌డీ ఎస్పీజీఎం గాంధీ, ఆర్‌ఐ ఎస్.కృష్ణ ఉన్నారు.

15న వినుకొండలో మినీ జాబ్ మేళా

నరసరావుపేట ఈస్ట్: జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ సహకారంతో డిపార్ట్ మెంట్ ఆఫ్ స్కిల్స్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 15న వినుకొండలోని ఏపీ ఎస్ఎస్‌డీసీ స్కిల్ హబ్ ఎస్‌జీకే ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద మినీ జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సంజీవరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాబ్ మేళాలో ఇన్వో సోర్స్ ప్రైవేట్ లిమిటెడ్, ప్రదక్షణ ఫిన్ టెక్ ప్రైవేట్ లిమిటెడ్ వంటి పలు కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని పేర్కొన్నారు. డిగ్రీ, బీటెక్, డిప్లొమా, ఫార్మసీ, పీజీ పూర్తిచేసిన 35 సంవత్సరాల వయస్సు లోపు గల నిరుద్యోగులు నేరుగా ఇంటర్వ్యూలకు హాజరుకావచ్చని తెలిపారు. వివరాలకు 99512 14919, 91602 00652 నెంబర్లకు సంప్రదించాలని పేర్కొన్నారు.



వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గుంటూరులో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి, జీడీసీసీ బ్యాంకు చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు



పొన్నూరులో మహానేత డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసిన నివాళులర్పిస్తున్న నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ

అన్ని వర్గాల సంక్షేమమే వైఎస్సార్ సీపీ లక్ష్యం



బృందావన్ గార్డెన్స్ రీజనల్ కోఆర్డినేటర్ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేస్తున్న జిల్లా అధ్యక్షులు దొక్కా మాణిక్యవరప్రసాద్

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్

పట్నంబజారు: అన్నివర్గాల సంక్షేమమే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ఆవిర్భవించిందని పార్టీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్ చెప్పారు. బృందావన్ గార్డెన్స్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ముందుగా మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించి కేక్‌ను కట్ చేశారు.

ఈ సందర్భంగా డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ పార్టీ 13 సంవత్సరాల నుంచి 14 సంవత్సరంలోకి అడుగుపెట్టిన శుభ సందర్భంగా పార్టీ కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తరువాత విజయాలు, లక్ష్యాలను చేరుకున్నారన్నారు. వైఎస్సార్ సీపీ రానున్న ఎన్నికలకు సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. అధిష్టానం ఆదేశాలకు అనుగుణంగా పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా ముందుకు సాగుతామని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు అంగడి శ్రీను, నాయుడు నాగేశ్వరరావు, అత్తోట జోసఫ్, గనిక ఝాన్సీ, రోజారాణి, దాసరి దరియా, రత్నకుమారి, వనజాక్షి, శారదాలక్ష్మీ, అనిత, గోరంట్ల మాధవి తదితరులు పాల్గొన్నారు.

పెదకాకానిలో ఘనంగా పుష్పశయనోత్సవం

- పుష్పశయ్యగా భ్రమరాంబ అమ్మవారు
- ముగిసిన మహాశివరాత్రి కల్యాణ బ్రహ్మోత్సవాలు



పెదకాకాని: భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో పుష్పశయనోత్సవ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పెదకాకాని శివాలయంలో మహా శివరాత్రి కల్యాణ బ్రహ్మోత్సవ వేడుకల్లో భాగంగా మంగళవారం భ్రమరాంబ అమ్మవారిని పుష్పశయ్యగా అలంకరించారు. పూజా కార్యక్రమాల్లో భాగంగా సుప్రభాతసేవ, మహాహారతులతో కార్యక్రమాలు ప్రారంభమైంది. అర్చకులు, వేదపండితులు మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, మహానివేదన, పంచహారతులు, ద్వాదశ ప్రదిక్షణములు, పుష్పశయనోత్సవము, ఫలప్రదానము, పవళింపు సేవ శాస్త్రోక్తంగా నిర్వహించారు. నేటితో ఆలయంతో కల్యాణ ఉత్సవాలు ముగిసినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ దాసర శ్రీరామ వరప్రసాదరావు, ధర్మకర్తల మండలి చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు తెలిపారు. పూజా కార్యక్రమాల్లో పాలకవర్గం సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహాక్షేత్రంగా చామర్రు

అచ్చంపేట: గ్రామాల్లోని దేవాలయాలు జీర్ణోద్ధరణకు గురికాకుండా ఆధునీకరించడం చాలా ముఖ్యమని, రాబోయే రోజుల్లో పవిత్ర కృష్ణానది ఒడ్డునగల చామర్రు గ్రామం మహాక్షేత్రంలా వర్ధిల్లుతుందని సచ్చిదానంద తపోవనం పీఠాధీశ్వరులు సచ్చిదానంత భారతీ స్వామి పేర్కొన్నారు. దేవాలయాల దశమ వార్షిక బ్రహోత్సవాల్లో భాగంగా మంగళవారం రెండవరోజు సచ్చిదానంత భారతీ స్వామి పాల్గొని, భక్తులకు సందేశమిచ్చారు.

ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపిన వైఎస్సార్ కుటుంబం



చైర్మన్ రాతంశెట్టి, డీసీవో వీరాచారి నుంచి డీఏ ఉత్తర్వులు అందుకుంటున్న యూనియన్ నాయకులు

ఉద్యోగుల యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు

నరసరావుపేట : ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ఉద్యోగులకు మేలు జరిగిందంటే అది వైఎస్సార్ కుటుంబం వల్లేనని ఉద్యోగుల యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శి పాలిమేర వెంకటరెడ్డి, ముప్పా వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఈ మేరకు వారు మంగళవారం స్థానికంగా విలేకర్లతో మాట్లాడారు. గతంలో ముఖ్యమంత్రిగా వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి సొసైటీల ఉద్యోగులకు దీంతో జీతాలు పెంపు, పీఎఫ్, గ్రాడ్యుటీ లాంటి సౌకర్యాలను కల్పిస్తూ 2009లో 151 జీవో ఇచ్చి, జాబ్ గ్యారెంటీ గుర్తింపును ఇచ్చారని గుర్తుచేశారు. అర్హత గల ఉద్యోగులను జిల్లా బ్యాంకుల్లో ఐదో తరగతి ఉద్యోగులుగా నియమించుకోవాలని అప్పటి సహకార శాఖ మంత్రి కాసు వెంకట కృష్ణారెడ్డి క్యాబినెట్ సబ్ కమిటీ ద్వారా అవకాశం కల్పించారని తెలిపారు. 2020 డిసెంబర్‌లో సొసైటీ ఉద్యోగులందరికీ హెచ్‌ఆర్ పాలసీ వర్తింపజేయాలని జీవో నంబరు 90ని సీఎం వైఎస్ జగన్ విడుదల చేశారన్నారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా 2,051 సహకార సంఘాల్లో పని చేస్తున్న 5,843 మంది ఉద్యోగులకు ప్రయోజనం చేకూరిందని వివరించారు. తాజాగా అన్ని సొసైటీల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు 138.30 డీఏ రేట్లను వర్తింపజేయాలని ఈ నెల 11న గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు, మూడు జిల్లాల డీసీవోలు ఉత్తర్వులు ఇచ్చినట్లు తెలిపారు. వైఎస్సార్ కుటుంబం వల్ల రాష్ట్ర వ్యాప్తంగా 5,843 ఉద్యోగుల కుటుంబాల్లో వెలుగులు నిండాయని యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు పేర్కొన్నారు. జిల్లా బ్యాంకు చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు, సీఈవో కృష్ణవేణి, డీసీవోలు వీరాచారి, నాగశ్రీనివాస్, రామారావుకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

సంక్షేమ సారథి సీఎం వైఎస్ జగన్

- ఆయన స్ఫూర్తితోనే సేవా కార్యక్రమాలు
- వైఎస్సార్ సీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ



వైద్య పరీక్షకు వచ్చిన వారితో సమన్వయకర్త అంబటి మురళి కృష్ణ

పొన్నూరు: ప్రజాసేవలో మహానేత డాక్టర్ వైఎస్సార్‌కు వారసుడిగా, ప్రజా క్షేత్రంలో ఎంతోమంది నిరుపేదలకు సంక్షేమాలు అందిస్తున్న ఒకే ఒక్కడుగా సీఎం వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి చరిత్ర సృష్టించారని వైఎస్సార్ సీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ తెలిపారు. సీఎం జగన్ స్ఫూర్తితో మార్చి 4న పొన్నూరు పట్టణంలోని బుర్రయ్య సత్రంలో జరిగిన బజరంగ్ 'సంక్షేమ సంగమం' కార్యక్రమంలో భాగంగా జరిగిన బజరంగ్ 'నేత్రజ్యోతి' శిబిరంలో పాల్గొన్న 640 మందికి వ్యక్తిగత కళ్లజోళ్లు మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రజలు వ్యక్తిగత కళ్లజోళ్లు ధరించి స్పష్టమైన దృష్టితో సంక్షేమ సారథి జగన్ చిత్రపటాన్ని చూసి భావోద్వేగానికి గురి కావడం గమనార్హం. సంక్షేమ సారథి ముఖ్యమంత్రి గారికి పేదల పట్ల ఉన్న వంటి శ్రద్ధను విస్తృతస్థాయిలో ప్రజానీకంలోకి తీసుకువెళ్లాలని నిర్ణయించినట్లు బజరంగ్ వ్యవస్థాపకులు, సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ తెలియజేశా రు. ప్రజా సేవ చేసిన ప్రతి నాయకుడు ప్రజల గుండెల్లో దైవ స్వరూపమై నిలుస్తాడని అందుకు జగన్మోహన్ రెడ్డి నిలువెత్తు నిదర్శనమని నియోజకవర్గ అభ్యర్థి అంబటి మురళీకృష్ణ తెలిపారు. గుండె సంబంధిత వైద్య శిబిరంలో యాంజియోగ్రామ్ చేయాల్సిన 15 మందిలో మొదటి విడతగా నలుగురిని ప్రత్యేక వాహనంలో విజయవాడ మెడ్ స్టార్ ఆసుపత్రికి తీసుకెళ్లగా వారిలో ఇరువురి ఆరోగ్య స్థితి మెరుగ్గా ఉండగా, ఒకరికి స్టంట్, ఒకరికి బైపాస్ సర్జరీ ఆవశ్యకత ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు. వారిని హాస్పిటల్‌లో సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ పరామర్శించారు. తదుపరి శస్త్రచికిత్స, స్టంట్లకు ఏర్పాట్లు చేయనున్నట్లు ఆయన చెప్పారు.

జగనన్నామ సంక్షేమ సంవత్సరంలో భాగంగా "మీ గుండె పదిలం' నినాదంతో చేపట్టిన వైద్య శిబిరాలు ఎంత ప్రయోజనకరంగా ఉన్నాయని తెలిపారు. బజరంగ్ బృందం పొన్నూరు నుంచి ప్రత్యేక వాహనం ఏర్పాటు చేసి అత్యంత శ్రద్ధగా పేషెంట్లను ఆసుపత్రికి తీసుకొని పరీక్షలు చేయించి తదుపరి చికిత్సలకు పంపడం పట్ల పొన్నూరు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆధ్యాత్మిక గ్రంథాలతో ప్రజల్లో దైవ చింతన

రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ



గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సత్యనారాయణ, కమిషనర్ సత్యనారాయణ

భవానీపురం(విజయవాడపశ్చిమ): పురాణ ఇతిహాసాలతో కూడిన ఆధ్యాత్మిక గ్రంథాలు ప్రజల్లో దైవ చింతన పెంపొందించేందుకు దోహదపడతాయని ఉప ముఖ్యమంత్రి, దేవదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ పేర్కొన్నారు. గుంటూరు జిల్లా సీతానగరంలోని స్టేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెంపుల్ ఎడ్మినిస్ట్రేషన్ (సిత)లో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని ఆయన మంగళవారం రాత్రి ప్రారంభించారు. అక్కడ ఉన్న పలు గ్రంథాలను ఆయన ఆసక్తిగా తిలకించారు. ఇటువంటి గ్రంథాలు నేటి తరం పిల్లలు తప్పనిసరిగా చదవాలని సూచించారు. రామాయణం, మహాభారతం, భగవద్గీత వంటి గ్రంథాలను చదివి వాటిల్లోని సారాంశాన్ని తెలుసుకుంటే జీవితం అద్భుతంగా ఉంటుందన్నారు. ముఖ్యంగా విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాసం పెంపొందేందుకు ప్రయోజనకరంగా ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ, చీఫ్ ఇంజినీర్ సుసర్ల శ్రీనివాస్, అధికారులు విజయరాజ్, రత్నరాజు, చంద్రమోహన్, దుర్గగుడి ఈఈలు కోటేశ్వరరావు, రమాదేవి, ధార్మిక పరిషత్ సభ్యులు పాపారావు, కర్రి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

నవరత్నాలతో బీసీలకు ఆర్థిక పరిపుష్టి



మాట్లాడుతున్న డాక్టర్ ఎన్.మారేష్

తెనాలి: సోషల్ మీడియాలో ట్రోలింగ్‌లకు మానసికంగా ఎంత నరకయాతన అనుభవించి ఉంటే ఇద్దరు చిన్నపిల్లలను మరిచిపోయి గీతాంజలి ఆత్మహత్యకు పాల్పడి ఉంటుందని ఆంధ్రప్రదేశ్ బీసీ కమిషన్ సభ్యుడు డాక్టర్ ఎన్.మారేష్ అన్నారు. ఇంతగా వ్యక్తిత్వ హననానికి పాల్పడటానికి గీతాంజలి చేసిన తప్పేమిటని ప్రశ్నించారు. ఐటీడీపీ, జనసేన సోషల్ మీడియా ట్రోలింగ్‌కు మానసిక వ్యధకు గురై ఆత్మహత్యకు పాల్పడిన గొల్తి గీతాంజలి కుటుంబాన్ని మంగళవారం సాయంత్రం డాక్టర్ మారేష్, కమిషన్ సహ సభ్యుడు కుందుర్తి గురవాచారి, బీసీ, విశ్వబ్రాహ్మణ సంఘాల నేతలతో కలిసి పరామర్శించారు. అనంతరం డాక్టర్ మారేష్ మీడియాతో మాట్లాడుతూ, గీతాంజలికి జరిగిన ఘోరానికి బీసీ వర్గాలన్నీ దిగ్భ్రాంతికి గురైనట్టు చెప్పారు. ప్రభుత్వం అందించిన లబ్ధిని చెప్పటమే పాపమా? అని ప్రశ్నించారు. వాస్తవానికి రాష్ట్రప్రభుత్వం అందిస్తున్న నవరత్నాలతో బీసీలు ఆర్థికంగా ఎదిగారని చెప్పారు. ఈ క్రమంలోనే లబ్ధిదారు గీతాంజలి ఆ విషయాన్ని సంతోషంగా చెప్పటం, కీచకుల్లా ఆమెపై సోషల్ మీడియాలో ట్రోల్ చేయటం హేయమైందని అన్నారు. గీతాంజలి మాట్లాడిన మాటల్ని వక్రీకరించి అసభ్య పదజాలంతో వేధించటం దారుణమన్నారు. కారకులు ఎవరైనా, వారి వెనుక ఎంతవారున్నా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బీసీ కమిషన్ సభ్యుడు కుందుర్తి గురవాచారి మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణ జాతి ముద్దుబిడ్డ గీతాంజలి మృతికి రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి స్పందించి రూ.20 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించటం ఊరటగా ఉందన్నారు. ఏపీ విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, బీసీ ఉద్యోగ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పావులూరి హనుమంతరావు మాట్లాడుతూ రాష్ట్రంలో 25 లక్షల విశ్వబ్రాహ్మణ సంఘీయులు ఉన్నట్టు చెప్పారు. గీతాంజలికి జరిగిన దారుణాన్ని ముక్తకంఠంతో ఖండిస్తున్నామని చెప్పారు. కారకులను కఠినంగా శిక్షించాలన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం మహిళా విభాగం అధ్యక్షురాలు వేముల బేబీరాణి, జాయింట్ సెక్రటరీ బండ్లమూడి రోజారాణి, అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర కార్యదర్శి జక్కా శ్రీనివాసయాదవ్, విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు అంగలకుదురు సుశీల మాట్లాడారు.

విజ్ఞాన్ విద్యార్థులకు అమెరికా ఇంటర్న్‌షిప్




విద్యార్థులను అభినందిస్తున్న విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య

చేబ్రోలు: విజ్ఞాన్ ఫార్మసీ కళాశాలకు చెందిన నలుగురు విద్యార్థులు అమెరికాలోని ప్రముఖ అడ్వాన్స్‌డ్ ఫార్మసీ హాస్పిటల్స్‌లో ఇంటర్న్‌షిప్‌కు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపల్ పి.శ్రీనివాసబాబు మంగళవారం తెలిపారు. విజ్ఞాన్ ఫార్మసీ కళాశాలలో ఫార్మా-డీకు చెందిన 6వ సంవత్సరానికి చెందిన నలుగురు విద్యార్థులు వి.నిస్సీ జోసెఫ్, బీ.శ్రీలేఖ, ఎస్‌కే. దెహనాజ్, ఏ.వెన్నెలలు అమెరికాలోని ప్రముఖ హాస్పిటల్స్‌లలో 4 వారాల అడ్వాన్స్‌డ్ ఫార్మసీ ప్రాక్టీస్ ఎక్స్‌పెరిమెంటల్ ట్రెనింగ్ ఇంటర్న్‌షిప్‌కు ఎంపికయ్యారు. వీరు ఏప్రిల్ 11, 12 తేదీలలో ఓహియోలోని యూనివర్సిటీ ఆఫ్ ఫిండ్లేలో జరగనున్న ఫార్మా-డీ సింపోసిజమ్ ఫర్ స్కాలర్‌షిప్ అండ్ క్రియేటివిటీ కాన్ఫరెన్స్‌లో మూడు రీసెర్చ్ పేపర్లు ప్రచురించడానికి అనుమతి లభించిందన్నారు. వీరిని విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య తదితరులు అభినందించారు.

ప్రభుత్వ వైద్యుల సంఘం అధ్యక్షుడిగా డాక్టర్ భాస్కరరావు



డాక్టర్ భాస్కరరావు



డాక్టర్ స్వరూప్‌కాంత్

గుంటూరు మెడికల్: గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ ఆఫ్ ఏపీ గుంటూరు జీజీహెచ్, గుంటూరు వైద్య కళాశాల అధ్యక్షుడిగా జీజీహెచ్ పీడియాట్రిక్ సర్జరీ ప్రొఫెసర్ డాక్టర్ చందా భాస్కరరావు మంగళవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. గుంటూరు జీజీహెచ్ శుశ్రుతాహాలులో మంగళవారం నూతనంగా ఎన్నికైన ప్రభుత్వ వైద్యుల సంఘం ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యుల సమస్యల పరిష్కారం కోసం ఎన్ని యూనియన్ లు పెట్టినా అభ్యంతరం లేదన్నారు. ప్రభుత్వ వైద్యుల సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపారు. సంఘం కార్యదర్శిగా జీజీహెచ్ ఈఎన్‌టీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ టి. స్వరూప్‌కాంత్, కోశాధికారిగా ఎనస్తీషియా అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె. ఇందిరా ప్రియదర్శిని ఇతర కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ సెంట్రల్ అబ్జర్వర్ డాక్టర్ బాబ్జి శ్యాంకుమార్ మాట్లాడుతూ తమ సంఘానికి వ్యతిరేకంగా దుష్ప్రచారం చేస్తున్న ఇతర యూనియన్ నేతలు తమ సంఘ గుర్తింపు పత్రాలు, సభ్యుత్వ నమోదు పత్రాలు బహిరంగంగా చూపించాలని సవాల్ విసిరారు. రాష్ట్ర విభజనకు పూర్వం సభ్యుల నుంచి వసూలు చేసిన రూ.3 కోట్లు ఇతర జమా ఖర్చుల వివరాలు బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జనరల్ మెడిసిన్ ప్రొఫెసర్ డాక్టర్ బి. శైలజ , డాక్టర్ ఉప్పాల శ్రీనివాస్, ఏపీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు, జీజీహెచ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మద్దు ప్రేమజ్యోతిబాబు తదితరులు పాల్గొన్నారు.